శనక్కాయల పరుషలో ఉచితంగా వ్యాపారాలు

బెంగళూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బసవనగుడి శనక్కాయల పరుషలో ఈ ఏడాది వ్యాపారాలు ఉచితంగా నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి ఈమేరకు శుక్రవారం వెల్లడించారు. ఈనెల 25, 26 తేదీల్లో కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పరుష నిర్వహించనున్నారు. దశాబ్దాలకాలంగా బసవనగుడి ప్రాంతంలో శనక్కాయల పరుష నిర్వహించడం ఆనవాయితీ.



మీడియాతో హోం మంత్రి పరమేశ్వర్

రాజకీయం ఎప్పుడైనా మారవచ్చు

● హోం మంత్రి పరమేశ్వర్

బెంగళూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయాలను పరిశీలిస్తే ఎప్పుడైనా, ఏమైనా జరగవచ్చునని మార్పులు ఉండవచ్చునని హోం మంత్రి పరమేశ్వర్ అభిప్రాయపడ్డారు. మైసూరులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ మైసూరులో పార్టీ ఆఫీసు స్థలం కోసం ఎంతగానో పోరాటం చేశానన్నారు. చంద్రప్రభ అరసుతో కలసి పలుసార్లు చర్చలు జరిపామన్నారు. ప్రస్తుతం స్థలం లభించిందని సాధ్యమైనంత త్వరగా నిర్మాణం చేపడ్తామన్నారు. సీఎం రూ.15కోట్లతో ఆఫీసు నిర్మించాలని తీర్మానించారన్నారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఆ తర్వాత ఏం జరుగుతుందో చెప్పలేమన్నారు. ప్రస్తుత రాజకీయాలు చూస్తే భవిష్యత్తు పరిణామాలు ఇలాగే ఉంటాయని చెప్పలేమన్నారు. మన ప్రభుత్వం ఉన్నప్పుడే త్వరగా శంకుస్థాపనలు చేయాలని సూచించారు. మంత్రి పరమేశ్వర్ వ్యాఖ్యలు పార్టీ కార్యకర్తలపై ప్రత్యేకించి మైసూరులోని సిద్దరామయ్య అభిమానులకు అనుమానం రేకెత్తించేలా మారింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రూ.50 కోట్లు, రూ.100 కోట్లు చెల్లిస్తే పార్టీ మారేవారు ఎవరూ లేరన్నారు. సీఎం సిద్దరామయ్య స్ట్రాంగ్‌గా ఉన్నారని, ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని కూల్చలేవన్నారు. రాష్ట్రంలో గ్యారెంటీలకు ఢోకా లేదన్నారు. అనంతరం మీడియా మీరు సీఎం అవుతారా అని అడిగిన ప్రశ్నకు పరమేశ్వర్ స్పందిస్తూ తనను ఇబ్బంది పెట్టవద్దని, సిద్దరామయ్య ఐదేళ్లపాటు సీఎంగా కొనసాగుతారన్నారు. దీంతో తాను సీఎం అయ్యే ప్రశ్నే ఉండదన్నారు.

ప్రభుత్వం కూలడం ఖాయం



● శీతాకాల సమావేశాల తర్వాత పలు రాజకీయ మార్పులు
● గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి

8

4 దశాబ్దాలుగా మావోల కదలికలు

● పదేళ్ల తర్వాత రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ ● 20 ఏళ్ల క్రితం ఏడుగురు పోలీసుల హతం



ఎన్‌కౌంటర్ జరిగిన పశ్చిమ కనుమల ప్రాంతం

బెంగళూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దక్షిణభారత దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తరహాలోనే మావోయిస్టుల ప్రభావం కర్ణాటకలోని పశ్చిమ కనుమల కేంద్రంగా పలు జిల్లాల్లో కొనసాగింది. నాలుగు దశాబ్దాలక్రితం మైసూరు, బెంగళూరులో ప్రారంభమై బీదర్‌లో పోరాటం ద్వారా రూపుదిద్దుకున్న ఉద్యమం రాయచూరుకు మళ్లింది. పశ్చిమకనుమల కేంద్రంగా నక్సల్స్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే చర్చలు చాలా ఏళ్లుగా ఉన్నా 2002లో తుపాకుల పేలుళ్లతోనే వెలుగులోకి వచ్చింది. కొప్ప తాలూకా మెణిసినహడ్య గ్రామానికి చెందిన చీరమ్మ కాలికి బుల్లెట్ తగిలి ఆసుపత్రికి రావడంతో బహిరంగమైంది.

1980లో పీపుల్స్‌వార్ పార్టీ ప్రభావంతో బెంగళూరులో ప్రగతిపరవిద్యార్థి కేంద్రం ప్రారంభం కాగా ఢిల్లీలోని జేఎన్‌యూలో చదివిన సాకేత్ రాజన్ రాష్ట్రంలో నక్సల్స్ ఉద్యమానికి రూపకర్త అయ్యారు. ఆ తర్వాత మైసూరులోనూ పోరాటం సాగింది. 1990లో బీదర్‌లో పోరాటానికి మద్దతు లభించకపోవడంతో రాయచూరుకు చేరి చంద్రబండ ప్రదేశంలో ఉద్యమం కొనసాగింది. అప్పట్లోనే కర్ణాటక విమోచనా రంగం మద్దతుతో మలెనాడులో ఆదివాసీల మద్దతుతో సంఘం బలపడింది. 2000నాటికి నక్సల్స్ కార్యకలాపాలు జోరుగా సాగాయి. 2003లో సింగ్సార్ గ్రామంలో రామచంద్రగౌడ ఇంటి సమీపాన పోలీసులు, నక్సల్స్ మధ్యన 2003 ఆగస్టు 6న పరస్పరం కాల్పులు కొనసాగాయి. అదే ఏడాది నవంబరు 17న కార్కళ తాలూకా ఈదు గ్రామం ఎన్‌కౌంటర్‌లో పార్వతి, హజీమాలు బలయ్యారు. అదే ఏడాది డిసెంబరు 29న శృంగేరి తాలూకా అటవీశాఖ గెస్ట్‌హౌస్‌కు నక్సల్స్ నిప్పుపెట్టారు. 2004 అక్టోబరు 7న శృంగేరి తాలూకాలో పోలీసు ముద్దప్పను నక్సల్స్ కిడ్నాప్ చేసి తుపాకీ లాక్కుని అనంతరం వదిలేశారు. తర్వాత కుద్రేముఖ్‌కు అనుబంధమైన బర్కణ జలపాతం వద్ద పరస్పరం కాల్పులు జరుపుకోగా ఇన్‌ఫార్మర్ పేరిట చంద్రకాంత అనే వ్యక్తిని నక్సల్స్ తీవ్రంగా దాడి చేశారు.

రాష్ట్రంలో నక్సల్ ఉద్యమ రూపకర్త సాకేత్‌రాజన్ 2005 ఫిబ్రవరి 6న కొప్ప తాలూకా మెణిసినహడ్య వద్ద ఎన్‌కౌంటర్ చేశారు. ఈ సంఘటనలో శివలింగు అనే పోలీస్ కూడా బలయ్యాడు. ఒక్కసారిగా రాష్ట్రంలో నక్సల్స్ ఉద్యమానికి బలం తగ్గినట్లయ్యింది. అయితే 2006లో అదే ప్రాంతంలో స్మారకాన్ని నిర్మించి శ్రద్ధాంజలి సభ జరిపారు. 2005లో శృంగేరి తాలూకా సిరిమనె వద్ద సింగప్పగౌడ ఇంటికి ఏడుగురు నక్సల్స్ వచ్చారు. అదే ఏడాది జూలై 23న కుందాపుర తాలూకా దేవరబాళు వద్ద ఎన్‌కౌంటర్‌లో సబ్లి ఉమేశ్, అజిత్ కుసుబిలో హతమయ్యారు. జూలై 28న కార్కళ తాలూకాలో పోలీసు జీపును నక్సల్స్ కాల్చారు. సెప్టెంబరు 24న మూడిగెరె తాలూకాలో పోస్టర్‌లు వేశారు. 2006లో నిరంతరంగా నక్సల్స్ కలాపాలు కొనసాగాయి. డిసెంబరు 25న శృంగేరి తాలూకా కసముడివద్ద ఎన్‌కౌంటర్‌లో నారావి దినకర్ బలయ్యారు. 2007లో నక్సలైట్ చన్నమ్మను పోలీసులు అరెస్టు చేశారు. జూన్ 3న నక్సల్స్ కాంగ్రెస్ నేత వెంకటేశ్‌ను హతమార్చారు. ఇదే ఏడాది జూలై 10న కొప్ప తాలూకా ఎన్‌కౌంటర్‌లో సింధనూరు గౌతమ్, కుద్రేముఖ్ జాతీయ ఉద్యానవన వ్యతిరేక కూటమి ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్, సుందరేశ్‌లు హతమయ్యారు. 2008లో హొరనాడు సమీపంలో జరిగిన కాల్పులలో నక్సల్స్ రవిదేవయ్య, మనోహర్‌లతోపాటు భాగమండలకు చెందిన కేఎస్‌ఆర్‌పి పోలీస్ గురుప్రసాద్ కూడా మృతిచెందారు. 2010 మార్చి 1న ఎన్‌కౌంటర్‌లో పంజాలు గ్రామానికి చెందిన వసంతగౌడ హతమయ్యాడు. 2011 లో కబ్బినాళ సదాశివగౌడను నక్సల్స్ హతమార్చడంతోపాటు మడామక్కిలో అటవీశాఖ కార్యాలయం, గెస్ట్‌హౌస్‌ను ధ్వంసం చేశారు. బీదర్‌గోడు వద్ద ఆర్టీసీ బస్సుకు నిప్పు పెట్టారు. 2014లో కుక్కె సుబ్రమణ్య అయినకిదు గ్రామంలో ఓ ఇంటికి నక్సల్స్ వచ్చారని ఏఎన్‌ఎఫ్ కార్యాచరణ ప్రారంభించింది. 2018లో శిరాడి, మిట్టమజలు వద్ద మూడు ఇళ్లకు నక్సల్స్ వచ్చారు. ఇటీవల ఐదేళ్లుగా రాష్ట్రంలో నక్సల్స్ కార్యకలాపాలు ఏమాత్రం సాగలేదు. కానీ ఇటీవల నవంబరు 7న ఉడుపిలోని ఈదు గ్రామానికి నక్సల్స్ వచ్చినట్లు సమాచారంతో ఏఎన్‌ఎఫ్ కూంబింగ్ ఆరంభించింది. ఈనెల 9న చిక్కమగళూరు జిల్లా కడగుంది గ్రామంలోని ఓ ఇంటికి నక్సల్స్ ముండగారు లత, జయణ్ణలు వచ్చినట్లు సమాచారంతో కూంబింగ్ తీవ్రతరం చేశారు. ఇలా సాగుతుండగానే సోమవారం రాత్రి విక్రమ్‌గౌడతోపాటు ఐదుగురు నక్సల్స్ ఉన్నారనే సమాచారంతో దాడి చేశారు. నలుగురు పరారీ కాగా విక్రమ్‌గౌడ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. అయితే అది నకిలీ ఎన్‌కౌంటర్ అని మాజీ నక్సల్స్ మండిపడ్డారు. కాగా రాష్ట్రంలో సంచలనం అనిపించేలాంటి సంఘటన 2005 ఫిబ్రవరి 10న తుమకూరు జిల్లా పావగడ తాలూకా నాగలమడక హోబళి వెంకటమ్మనహళ్ళిలో చోటు చేసుకుంది. గ్రామ శివారులోని పాఠశాలలో కర్ణాటక స్టేట్ రిజర్వు పోలీస్ 9వ క్యాంప్ సిబ్బంది సేద తీరుతుండగా 300మంది నక్సల్స్ దాడి చేసి ఏడుగురు పోలీసులతోపాటు ఓ పౌరుడిని హతమార్చారు. ఈ కేసులో ఉద్యమనేతలు వరవరరావుతోపాటు ప్రముఖులు ఉన్నారు. కాగా పదేళ్లక్రితం నక్సల్స్ ఉద్యమంలో చురుగ్గాఉన్న సిరిమనె నాగరాజ్, నూర్ జుల్ఫికర్ అలియాస్ నూర్ శ్రీధర్‌లు ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం కోరకుండా లొంగిపోయారు. ఇలా రాష్ట్రలో పలు మార్లు మావోల అలజడి కలకలం రేపినా ఇటీవల తగ్గుముఖం పట్టిందనే చెప్పవచ్చు.

అదానీని రక్షిస్తున్నది ఎవరు..?

● సీఎం సిద్దరామయ్య ● కర్ణాటకలో ఆస్తులపై విచారించండి: కేంద్రమంత్రి



బెంగళూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అరెస్టు వారెంట్ వెలువడినా కేంద్ర దర్యాప్తు సంస్థలు అదానీని ఎందుకు అరెస్టు చేయడం లేదని అతడిని రక్షిస్తున్నవారు ఎవరని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశ్నించారు. మైసూరులో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ అదానీతో అంతర్జాతీయస్థాయిలో భారతగౌరవం పదే పదే మంటగలిసిందన్నారు. అదానీకి వ్యతిరేకంగా మీడియా ఎందుకు మాట్లాడదని, దేశ ప్రజలకు వాస్తవాలు ఎందుకు చూపడం లేదన్నారు. రాష్ట్రానికి నాబార్డు రుణంలోనూ కేంద్రం అన్యాయం చేసిందని, ఏకంగా 58శాతం తగ్గించిందన్నారు. రైతుల పట్ల రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. సోకాల్డ్ భూమిపుత్రుడిగా చెప్పుకునే కేంద్ర మంత్రి కుమారస్వామి ఎందుకు నోరు తెరవరని ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికైన కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌ను నాబార్డు రుణంలో అన్యాయాన్ని సరిచేయాలని కోరామన్నారు. రాష్ట్రంలో రేషన్‌కార్డుల రద్దుపై ఎనలేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. 7 కేజీల బియ్యాన్ని యడియూరప్ప 5కేజీలకు తగ్గించలేదా..? అంటూ ప్రశ్నించారు. విజయేంద్రను పార్టీ అధ్యక్షుడిని చేసిన యడియూరప్ప, ముఖ్యమంత్రిని చేయాలని భావిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బీపీఎల్ కార్డులు ఇవ్వాలా..? అంటూ ప్రశ్నించారు. కాగా బెంగళూరులో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె మాట్లాడుతూ గౌతమ్ అదానీ ఆస్తులు కర్ణాటకలోనూ ఉన్నాయని విచారణ జరపాలని, మీకు అడ్డు చెప్పినవారు ఎవరని సవాల్ విసిరారు.

నేడే ఉప ఫలితాలు

● మూడు చోట్ల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు
● కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

బెంగళూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మూడు శాసనసభ నియోజకవర్గాలకు చెందిన ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. హావేరి జిల్లా శిగ్గావి ఉప ఎన్నికకు సంబంధించి హావేరి పరిధిలోని దేవగిరి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో లెక్కింపు జరగనుంది. 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. రామనగర జిల్లా చన్నపట్టణకు సంబంధించి ఓట్ల లెక్కింపు రామనగరలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. 15 రౌండ్లు లెక్కింపు సాగనుంది. ఇక సండూరు రిజర్వు నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు బళ్ళారి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్కించనున్నారు. శిగ్గావికి 18మంది, చన్నపట్టణకు 30మంది, సండూరుకు 21మంది ఓట్ల లెక్కింపునకు ఉద్యోగులను కేటాయించారు. ముందస్తుగా పాస్‌లు పొందిన మీడియా ప్రతినిధులను మాత్రమే అనుమతించనున్నారు. కౌంటింగ్ జరిగే అన్ని కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు విధించారు. కౌంటింగ్ తర్వాత ఎలాంటి ఫలితాలు ఉంటాయనేది ఉత్కంఠగా మారింది.



బళ్లారిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాజేశ్

వక్ఫ్‌బోర్డు చర్యలను అడ్డుకుంటాం: బీజేపీ



నిరసనలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ నాయకులు

బెంగళూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా పంటలసాగు చేసుకుని జీవనం చేస్తున్న రైతుల పాలిట వక్ఫ్‌బోర్డు అరాచకానికి పాల్పడుతోందని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. వక్ఫ్‌బోర్డుకు వ్యతిరేకంగా నగరంలోని ఫ్రీడంపార్కులో శుక్రవారం జరిగిన నిరసనలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, ఎంపీ పీసీ మోహన్, శాసనసభ్యులు అశ్వత్థనారాయణ, కేసీ రామమూర్తి, మునిరత్న, ఎమ్మెల్సీ సీటీ రవితోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ మఠాలు, విద్యాసంస్థల భూములకు వక్ఫ్ నోటీసులు జారీ చేస్తోందని మండిపడ్డారు. మన భూమి - మన హక్కు అనేనినాదంతో బాధిత రైతులకు అండగా ఉంటామన్నారు. రాష్ట్రప్రభుత్వం చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తదుపరి నోటీసులు జారీ చేస్తే రోడ్డెక్కాల్సి ఉంటుందని హెచ్చరించారు. కనీస సమాచారం లేకుండా రాత్రికి రాత్రి నోటీసులు ఎలా జారీ చేస్తారని ప్రశ్నించారు. ఇది చిన్న విషయం కాదని, లక్షలాదిమందికి సంబంధించిన ఆస్తుల అంశమన్నారు. బీదర్‌లో కోట సైతం వక్ఫ్ ఆస్తిగా ఎలా మారిందని ప్రశ్నించారు. బెంగళూరులోనూ పలు ప్రాంతాల్లో భూములు వక్ఫ్ ఆస్తులుగా మార్చేశారన్నారు. డీజే హళ్ళి, కేజే హళ్ళి విధ్వంసంపై నమోదైన కేసులను రద్దు చేస్తారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల మెప్పు పొందేందుకు ఎంతటికైనా సిద్ధమనేలా మారిందన్నారు. నేను పేదవాడు అనే సీఎం సిద్దరామయ్యను ఉద్దేశించి తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఏ సీమలోని పేదవాడివని ప్రశ్నించారు. అన్నం పెట్టే రైతుకు కన్నం వేస్తున్నారన్నారు. రేషన్‌కార్డుల రద్దుతో లక్షలాదిమంది ఆసుపత్రులకు వెళ్లేందుకు భయపడుతున్నారని మండిపడ్డారు. సిద్దరామయ్య పాలన ఆరంభమయ్యాకనే ఓ సామాజికవర్గం ఎంతటికైనా సై అనేలా తెగిస్తోందన్నారు. బీపీఎల్ కార్డులను రద్దు చేశారని, ఆసుపత్రుల్లో ఫీజులు పెంచారన్నారు. కేంద్రమంత్రి శోభాకరంద్లాజె మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో వక్ఫ్ అనే పదమే లేదన్నారు. కానీ దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూమి వక్ఫ్‌కు ఎలా చేరిందని ప్రశ్నించారు. వేల ఎకరాల నుంచి 38 లక్షలకు ఎలా పెరుగుతుందన్నారు. చట్టం ప్రకారం అదాలత్ చేసేందుకు అవకాశం లేదన్నారు. చాళుక్య కాలంనాటి సోమేశ్వర, బీరేశ్వర ఆలయం కూడా వక్ఫ్ ఆస్తిగా మారిందన్నారు. కిత్తూరు రాణి చెన్నమ్మ లింగాయతలకు దానం చేసిన భూమి వక్ఫ్‌ఆస్తిగా మారిందంటే ఏమని అర్థం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ సీటీ రవి మాట్లాడుతూ 1995లో వక్ఫ్ చట్టాన్ని సవరణ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగంవైపా... షరియ వైపా... అనేది నిర్ధారించాలన్నారు. సీఎం సిద్దరామయ్య మాత్రం మంత్రి జమీర్‌ను నమ్మారని ఆయన ఎప్పుడు నిప్పు పెడతాడో తెలియదన్నారు.

మండ్యలో జరిగిన నిరసనలో మాజీ ఎంపీ సుమలత పాల్గొన్నారు. దశాబ్దాలుగా రైతులకు చెందిన భూమి ఒక్కసారిగా ఎలా మారుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు మాత్రమే న్యాయం చేసేలా వ్యవహరిస్తోందన్నారు. బీపీఎల్ కార్డులు రద్దు చేశారని మండిపడ్డారు.

నా భూమి కూడా వక్ఫ్‌గా మారింది : మాజీ మంత్రి జొల్లె

బెళగావి జిల్లా చిక్కోడిలో జరిగిన నిరసనలో మాజీ మంత్రి శశికళ జొల్లె మాట్లాడుతూ వక్ఫ్‌శాఖ మంత్రిగా వ్యవహరించిన తన భూమిని సైతం వక్ఫ్‌కు చెందినట్టు మార్చారన్నారు. చాలా ఏళ్లుగా లవ్ జిహాద్ సాగిందని, ప్రస్తుతం ల్యాండ్ జిహాద్ కొనసాగుతోందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నేతృత్వంలో ఐదు బృందాలు జిల్లాలవారీగా అధ్యయనం చేస్తామని, శాసనసభ శీతాకాల సమావేశాలలో పోరాటం చేస్తామన్నారు.

తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల మార్పు తప్పనిసరి

● బోర్డు సమావేశంలో సుదీర్ఘ చర్చ ● నౌలి ప్రాజెక్ట్ ప్రతిపాదనపై అభ్యంతరం ● ఖాతాల ఫ్రీజ్‌తో వేతనాలకు ఇబ్బందులు

రాయదుర్గం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి సంబంధించిన 33 క్రస్ట్ గేట్లను తప్పనిసరిగా మార్చాలని బోర్డు తీర్మానించింది. క్రస్ట్ గేట్ల సామర్థ్యంపై జాతీయస్థాయి కంపెనీలతో సమగ్ర తనిఖీలు నిర్వహించి ప్రతిపాదనలను సిద్ధం చేసేందుకు బోర్డు సమావేశం నిర్ణయించింది. శుక్రవారం హొస్పేట్‌లో తుంగభద్ర బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ స్థాయిలో పేరుపొందిన కర్నైపుడి, జంషెడ్‌పూర్ కంపెనీలను ఇప్పటికే క్రస్ట్ గేట్ల సామర్థ్యం గురించి ఒక్కొక్కటిగా తనిఖీలు నిర్వహించి నివేదిక ఇవ్వాలని కోరామన్నారు. దీనికి సంబంధించి జనవరి చివరికల్లా విధివిధానాలు పూర్తిచేసి బిడ్స్‌ను పిలిచి సమగ్రంగా ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా నిర్ణయించారు. డిసెంబర్ 7న ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ జైన్ కూడా డ్యాంను సందర్శించనున్నారని, ఈ నేపథ్యంలో డ్యాం సేఫ్టీకి సంబంధించి పూర్తిస్థాయి నివేదిక అందుతుందన్నారు. డ్యాం క్రస్ట్ గేట్లను మార్పు చేసేందుకు తక్కువ బిడ్ దాఖలు చేసిన వారికే టెండరు ప్రక్రియను అప్పగించాలని నిర్ణయించారు. ఈనెల 25న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్రస్ట్ గేట్లను పరిశీలించేందుకు జాతీయస్థాయి కంపెనీలు నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. అదే విధంగా కర్ణాటక ప్రభుత్వం నౌలి రిజర్వాయర్‌ను నిర్మించేందుకు బోర్డు అనుమతిని కోరింది. అందుకు ఆంధ్ర ప్రతినిధిగా హాజరైన సీఈ నాగరాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమాంతర కాలువ ప్రతిపాదన కూడా బోర్డు ముందు ఉందని, దానిపై నిర్ణయం తీసుకునే దాకా నౌలికి ఆమోదం తెలిపేది లేదని స్పష్టం చేశారు. సమాంతర కాలువ, నౌలి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి ఆయా రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రావాల్సి ఉందన్నారు. రాష్ట్రాల ఏకాభిప్రాయం వచ్చేదాకా దీని గురించి ప్రస్తావించబోమని స్పష్టం చేశారు. బోర్డుకు సంబంధించి ఖాతాలను ఫ్రీజ్ చేయడంతో సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. పనుల్లో ఏమైనా తప్పిదాలు జరిగి ఉంటే బిల్లుల వరకు చెల్లింపులు నిలిపి వేస్తే బాగుంటుందని, వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు బోర్డు కోరింది. సమావేశంలో బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ నీలకంఠారెడ్డి, సీఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఐసీసీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శివరాజ్ తంగడి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మార్చి చివరి వరకు నీరు: మంత్రి

కంప్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆయకట్టు భూములకు రబీ పంటలకు మార్చి చివరి వరకు సాగునీరు అందించేందుకు బెంగళూరులో జరిగిన తుంగభద్ర నీటి పారుదల సలహా సమితి ఐసీసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని మంత్రి శివరాజ్ తంగడి తెలిపారు. శుక్రవారం హొస్పేటలో తుంగభద్ర బోర్డు సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హెచ్చెల్సీకి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో జనవరి 31 వరకు నీటిని విడుదల చేస్తారన్నారు. బళ్లారి, విజయనగర, రాయచూరు, కొప్పాళ, ప్రజాప్రతినిధులు ఐసీసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారమే జలాశయంలో 96 టీఎంసీల నీటి నిల్వ వుండటంతో ఈ యేడాది ఎన్నడూ లేని విధంగా రబీ పంటలకు కూడా మార్చి వరకు నీరు అందించేందుకు సిద్ధమయ్యామన్నారు. ఎల్ఎల్సీకి రబీలో బళ్లారి, ఆంధ్ర, కడప, కర్నూలు జిల్లాలకు ఆర్ఏ కుడి దిగువ కాలువకు ఎల్ఎల్సీ డిసెంబరు 1 నుంచి 15 వరకు 400 క్యూసెక్కులు, 16 నుంచి 31 వరకు 600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తామన్నారు. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు 650 క్యూసెక్కుల చొప్పున మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు నీటిని విడుదల చేస్తామన్నారు. మార్చి 1 నుంచి 31 వరకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారని తెలిపారు. హెచ్చెల్సీ బళ్లారి, ఆంధ్రలోని అనంతపురం జిల్లాకు పారే తుంగభద్ర కుడి కాలువ హెచ్చెల్సీకి నవంబరు చివరి వరకు కొనసాగుతాయి. డిసెంబరు 1 నుంచి 10 వరకు నీటిని నిలిపివేస్తారు. 11 నుంచి 31 వరకు కర్ణాటక వాటా కింద 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. అనంతరం జనవరి నుంచి 10 వరకు నీటిని నిలిపివేసి 11 నుంచి 31 వరకు 800 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తారన్నారు. రాయబసవ కాలువ (ఎడమ కాలువ)కు రాయచూరు, కొప్పాళకు ప్రస్తుతం పారుతున్న నాలుగు వేల క్యూసెక్కుల నీరు నవంబరు చివరి వరకు ఇలాగే కొనసాగుతాయి. డిసెంబరు 1 నుంచి 15 వరకు 1500 క్యూసెక్కులు, డిసెంబరు 16 నుంచి 31 వరకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారన్నారు. .జనవరి 1 నుంచి మార్చి 31 వరకు 3800 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తారన్నారు. అనంతరం విడుదల చేసిన నీరు తాగడానికి మాత్రమే వినియోగించాలని కోరారు. రాయబసవన్న కాలువ డిసెంబరు 1 నుంచి డ్యామ్ నీటి మట్టం 1585 నీటి మట్టం చేరుకునే వరకు 25 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తామన్నారు. రబీలో కూడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నీటిని సక్రమంగా అందిస్తామన్నారు. 19వ గేటు తెగిన సమయంలో ముఖ్యమంత్రులు సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలో కష్టపడి గేట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షాన వుంటుందని తెలిపారు. సమావేశంలో భారీ నీటి పారుదల మంత్రి బోసురాజు, కాడా అధ్యక్షుడు హసేన్ సాబ్, దోతిహాళ్, ఎమ్మెల్యే పంపన్న గౌడ, యువరాజు, ఎస్ పటేల్, బసన్న గౌడ, దద్దల్, బీఎన్ నాగరాజు, గవియప్ప, బసన్నగౌడ, వసంతకుమార్, శరనుగౌడ, భైరాపుర, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో భక్తుల సందడి









ప్రసంగిస్తున్న సేతురామన్



సేతురామన్‌ను సత్కరిస్తున్న ఆర్‌జే రత్నాకర్









విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తున్న యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్, యూనివర్సిటీ చాన్సిలర్ చక్రవర్తి

సర్వం సిద్ధం

నేడు సత్యసాయి 99వ జయంత్యుత్సవం

దేశవిదేశాల నుంచి వచ్చిన భక్తులు | ముఖ్యఅతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ | పోలీస్ వలయంలో పుట్టపర్తి

పుట్టపర్తి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి సత్యసాయి జయంత్యుత్సవాలకు ముస్తాబైంది. సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలకు దేశవిదేశాల నుంచి భక్తులు పుట్టపర్తికి రావడంతో సందడి నెలకొంది. సత్యసాయి 99వ జయంతి వేడుకలకు వేదికైన సత్యసాయి సన్నిధి సాయికుల్వంత్ మందిరాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. పుట్టపర్తి పురవీధుల్లో తోరణాలు, విద్యుత్ కాంతులతో అలంకరించారు. సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత జయంతి వేడుకలు శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమ్మైతాయి. 9.10కి సత్యసాయి ట్రస్టు వార్షిక నివేదిక విడుదల చేస్తారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. సాయంత్రం స్వర్ణ రథంపై సత్యసాయి చిత్రపటం ఊరేగిస్తారు.

పుట్టపర్తిలో సందడి

సత్యసాయి 99వ జయంత్యుత్సవాలను తిలకించేందుకు ప్రముఖులతోపాటు దేశవిదేశాల భక్తులు తరలివచ్చారు. ప్రశాంతి నిలయంతోపాటు పట్టణంలోని వీధులు ఇప్పటికే భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ప్రశాంతి నిలయంలో ఎటుచూచిన జనమే కన్పిస్తున్నారు. సత్యసాయి మహాసమాధిని భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించారు. పుట్టపర్తి వీధుల్లో భక్తులు సందడి కల్పించింది. పుట్టపర్తికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తోపాటు ప్రముఖులు, దేశ విదేశాల భక్తులు రానున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. పుట్టపర్తికి వచ్చే ప్రధాన రహదారులతోపాటు ప్రశాంతి నిలయంలో దారి పొడవునా పోలీసులు కన్పిస్తున్నారు. జయంతి వేడుకల్లో పాల్గొనే భక్తులు, ప్రజలకు తాగునీరు, వైద్యసేవలు, వాహనాల పార్కింగ్, తాత్కాలిక వసతి, సమాచారకేంద్రాలను అధికారయంత్రాంగం ఏర్పాటు చేసింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు: శుక్రవారం సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి హయ్యర్ సెకండరీ విద్యార్థులు సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి ఆధ్యాత్మికత సేవలు, బోధనలపై చేపట్టిన నాటిక భక్తులను అలరింపచేసింది. సాయికుల్వంత్‌లో ప్రత్యేక దీపాలంకరణ చేశారు.

నేడు జయంతి వేడుకలు: శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్‌లోని సభామండపంలో శనివారం నిర్వహిస్తారు. ఇందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వేడుకలలో పాల్గొనడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.



సాయి విద్యావిధానం... ఆదర్శం

శ్రీసత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవంలో వక్తలు

విద్యార్థులకు బంగారు పతకాల పంపిణీ

అట్టహాసంగా వేడుకలు



అతిథులకు విద్యార్థుల స్వాగతం

పుట్టపర్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసం, మానవత్వం, సామాజిక స్పృహతో కూడిన సత్యసాయి విద్యావిధానం ప్రపంచంలోనే అందరికి ఆదర్శమని యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్ కొనియాడారు. శుక్రవారం ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్రహాల్‌లో శ్రీసత్యసాయి యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మొదట ముఖ్యఅతిథులు, వీసీ, అధ్యాపకులను విద్యార్థులు మంగళవాయిద్యాలతో వేదిక వద్దకు తీసుకొచ్చారు. విద్యార్థులు వేద పఠనంతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. సేతురామన్ పంచనాథన్ మాట్లాడుతూ... సత్యసాయి విద్యావిధానంతో విద్యార్థులు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసంతో బయటకు వస్తున్నారన్నారు. ప్రపంచంలో పలు యూనివర్సిటీలు సందర్శించానని, ఇటువంటి విలువలతో కూడిన విద్యావిధానాన్ని ఎక్కడా చూడలేదన్నారు. సత్యసాయి విద్యార్థులుగా సత్యసాయి బోధనలు, ఆధ్యాత్మికతను ప్రచారం చేయాలని కాంక్షించారు. అనంతరం సేతురామన్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సన్మానించారు.

21 మందికి బంగారు పతకాలు

సత్యసాయి యూనివర్సిటీలో ఉత్తమ ఫలితాలు సాధించిన 21 మంది విద్యార్థులకు ముఖ్యఅతిథి సేతురామన్, యూనివర్సిటీ చాన్సిలర్ చక్రవర్తి బంగారు పతకాలు అందజేశారు. మరో 14 మందికి పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. 463 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. స్నాతకోత్సవంలో సత్యసాయి యూనివర్సిటీ పరిధిలోని ప్రశాంతి నిలయం క్యాంపస్, అనంతపురం మహిళా క్యాంపస్, బెంగళూరులోని బృందావనం, చిక్‌బళాపురంలోని ముద్దనహళ్లి క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాల్గొన్న ప్రముఖులు

స్నాతకోత్సవంలో వీసీ రాఘవేంద్రప్రసాద్, ట్రస్టు సభ్యులు డాక్టర్ మోహన్, నాగానందం, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, సేవాసంస్థల ప్రతినిధులు నిమీష్‌పాండే, చీర, కోటేశ్వరరావు, దేశవిదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి





చరణ్ మృతదేహం, ఆస్పత్రిలో విలపిస్తున్న తల్లిదండ్రులు

గుంతకల్లుటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన విద్యార్థి మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. మండలంలోని నెలగొండ గ్రామానికి చెందిన గోవిందు, శకుంతల దంపతులకు చరణ్, ఒక కూతురు ఉన్నారు. చరణ్(14) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తండ్రి గోవిందు ఉపసర్పంచుగా కొనసాగుతున్నాడు. అతడు వ్యవసాయం, కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం చరణ్ స్కూల్‌కు వెళ్లలేదు. గోవిందు అన్న కొడుకులు చెన్నకేశవులు, సింహాద్రి, చిన్న గొర్రెలు మేపడానికి గ్రామ శివారులోని చెక్‌డ్యాం వద్దకు వెళ్లారు. సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడడానికి చరణ్ కూడా మధ్యాహ్నం అక్కడికి వెళ్లాడు. చెక్‌డ్యాంలో కాసేపు ఈత కొట్టాడు. మధ్యలోకి వెళ్లొద్దు లోతు ఎక్కువగా ఉందని చెన్నకేశవులు వారించి భోజనం చేసేందుకు వెళ్లాడు. తనకు ఈత వచ్చు అని చెప్పి చరణ్ మధ్యలోకి వెళ్లాడు. భోజనం చేసి వచ్చేసరికి చరణ్ కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల పొలాల్లో ఉన్న వారిని పిలిచాడు. సుమారు గంటన్నరపాటు నీటిలో వెతకగా చరణ్ దొరికాడు. వెంటనే చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మృతి చెందాడన్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ప్రభుత్వా ఆసుపత్రికి చేరుకున్నారు. చరణ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. చరణ్ నిద్రపోతున్నాడని, తాను పిలిస్తే లేస్తాడని తల్లి శకుంతల కొడుకు మృతదేహం పడి రోధించిన తీరు అందరిని కలచివేసింది. చరణ్ లే ఇంటికి పోదామంటూ ఆమె విలపించింది.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామాజిపల్లి సమీపంలో రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. హిందూపురం రైల్వేపోలీసు హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు రామగిరి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన మురళి(32) కియా కార్ల కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వచ్చి క్షణికావేశంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే కీమ్యాన్, లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఘటనా స్థలం వద్ద బ్యాగులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మురళికి భార్య అంబిక, కుమార్తె, కుమారుడు ఉన్నారు. హిందూపురం రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గల్ఫ్ దేశాలకు అనంత అరటి

బనానా రైలును వర్చువల్‌గా ప్రారంభించిన ప్రిన్సిపల్ సెక్రటరీ.. హాజరైన ఎంపీ, కలెక్టర్ హాజరు



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న ఎంపీ, మున్సిపల్ చైర్మన్, కలెక్టర్, అధికారులు

తాడిపత్రి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా అరటి గల్ఫ్‌దేశాలకు ఎగుమతి అవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో ముంబై వరకు బనానా రైలును ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, గుంటూరు సిరికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో బనానా రైలును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా అరటి ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయికి చేరడం శుభపరిణామన్నారు. ముంబై నుంచి షిప్‌ద్వారా ఇరాక్ దేశానికి వెళ్లడం ఈ అరటికి ఎంత గిరాకీ ఉందో అర్థమవుతోందన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ 2003లో అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో కరువు బారి నుంచి జిల్లాను కాపాడడానికి ప్రణాళికలు అమలు చేసేవారమని గుర్తు చేసుకున్నారు. జిల్లాను ఫ్రూట్స్ హబ్‌గా మార్చిన అధికారులు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లా అరటిని ప్రపంచంలో అగ్రగ్రామిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని తెలిపారు. 2016లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో ఆలోచించి రైతులకు అనేక సదుపాయాలు కల్పించారన్నారు. లక్ష టన్నులకు ఎగుమతులు చేసేస్థాయికి జిల్లా చేరుకోవడం సీఎం ముందు చూపుతోనే సాధ్యమైందన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అరటి, దానిమ్మ, చీనీ, సపోటా, బొప్పాయి పండ్లతోటలకు ప్రసిద్ధిగాంచిందన్నారు. ఒకప్పుడు రాయలసీమ అంటే రాళ్ల సీమ అనేవారని ప్రస్తుతం పంటలు పండించుకుంటూ రతనాల సీమగా తయారైందని సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాను వివిధ ఉద్యానవన పంటల ఉత్పత్తికి కేంద్రంగా పరిగణించవచ్చన్నారు. జిల్లాకు ప్రత్యేక వాతావరణ పరిస్థితులు, సామర్థ్యాలు ఉన్నాయని, ఇవి ఏడాది పొడవునా సాగుకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో న్యూఢిల్లీ ఏపీఈడీఏ జనరల్ మేనేజర్ వినీతసుధన్షు, హైదరాబాద్ కంటైనర్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ చెక్ మేనేజర్ అనిత బారిక్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, శ్రీకృష్ణ ఇంపెక్స్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అనిష అగర్వాల్, ఆర్డీఓ కేశవనాయుడు, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయయణచౌదరి, ఎన్‌ఐసీ డీఐఓ రవిశంకర్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏడీ ఫిరోజ్ ఖాన్, రైల్వేస్టేషన్ మాస్టర్ అనిల్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు కార్తీక వనభోజన మహోత్సవం

రాప్తాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అఖిల భారత కాకతీయ ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. రాప్తాడు మండలం హంపాపురం వద్ద 44వ జాతీయ రహదారి పక్కన నాగశేషు వ్యవసాయ క్షేత్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతుల దుర్మరణం

ముదిగుబ్బ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో నాగారెడ్డిపల్లికి చెందిన దంపతులు గంగన్న (80), నరసమ్మ (75) మరణించారు. వీరు మలకవేములక్రాస్‌కు వచ్చారు. తిరిగి ఆటోలో స్వగ్రామానికి వెళ్లేందుకు నాగారెడ్డిపల్లి క్రాస్ వద్ద దిగారు. రోడ్డు దాటుతుండగా ముదిగుబ్బ వైపు నుంచి కదిరి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్నం ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

ప్యాసింజరు రైళ్ల నంబర్ల మార్పు

గుంతకల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్‌కు చెందిన పలు ప్యాసింజరు రైళ్ల నెంబర్లను మార్పు చేసినట్లు అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మార్పు జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తున్నందన్నారు. వివిధ రైళ్ల మారిన నెంబర్లు ఇలా ఉన్నాయి.

ప్యాసింజరు రైలు	పాత నంబరు	కొత్త నంబరు
గుంతకల్లు-డోన్	07288	77203
డోన్-గుత్తి-డోన్	07289/90	77205/06
కర్నూలుసిటీ-గుంతకల్లు	07292	77204
గుంతకల్లు-హిందూపురం-గుంతకల్లు	07693/94	77213/14
గుంతకల్లు-రాయచూరు-గుంతకల్లు	07799/800	77201/02

ఊయలలో ఊపిరి ఆడకే

పోస్టుమార్టం నివేదికలో వెల్లడి

చిన్నారి మృతి..!



ప్రాణాలు వదిలిన ఐదునెలల పసికూన(ఫైల్)

అనంతపురం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఊయలలో ఊపిరి ఆడకపోవడంతో పసిబిడ్డ మృతి చెందే అవకాశం ఉన్నట్లు జిల్లా సర్వజనాస్పత్రి వైద్యులు వెల్లడించారు. రెండు రోజుల కిందట నార్పలలో ఓఆర్యవైశ్య కుటుంబం అప్పులు బాధ తాళలేక ఆత్యహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సమయంలో వారి ఐదు నెలల కుమారుడు కూడా చనిపోయాడు. అయితే ఆ పసిబిడ్డ మరణంపై రకరకాల వాదనలు వెలువడ్డాయి. పసిబిడ్డను ముందుగానే చంపి వారు ఆత్మహత్య చేసుకున్నారా? లేక పాప ఊయలలో పడుకున్న సమయంలో వారు ఆత్యహత్య చేసుకున్నారా? అని రకరకాల ప్రశ్నలు తలెత్తాయి. పోలీసులు సైతం పసి బిడ్డను తల్లిదండ్రులు చంపలేదని, అలాంటి ఆనవాళ్లు కనిపించలేదని మృతదేహాన్ని పరిశీలించినప్పుడే పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టమ్ నిర్వహించిన జిల్లా సర్వజన ఆస్పత్రి ఫోరెన్సిక్ డాక్టర్లు ఆ పసిబిడ్డను ఎవరు చంపలేదని నిర్ధారించారు. తల్లిదండ్రులు ముందుగానే ఇంట్లో ఉన్న ఊయలలో ఆ పసిబిడ్డను బోర్లా పడుకోబెట్టారని, దీని వల్ల ఊపిరి ఆడక మరణించి ఉండే అవకాశం ఉందన్నారు. నెలల చిన్నారిని ఇలా ఊయలలో బోర్లా పడుకోబెడితే పక్కకు తిరగలేదని, అలాంటపుడు ఊపిరి ఆడక మూడు నుంచి ఐదు నిమిషాలలోనే పసిపిల్లలు చనిపోతారని ఫోరెన్సిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టరు శంకర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దీనిని వైద్య పరిభాషలో సఫోకేషన్ అని అంటారని ఆయన అన్నారు. నార్పల ఘటనలో కూడా ఇదేజరిగి ఉండవచ్చని, దీని వల్లే పసిబిడ్డ చనిపోయిందని వెల్లడించారు.

సూసైడ్ నోట్‌లో ఏముందో?

కృష్ణకిషోర్ దంపతుల సూసైడ్ నోట్‌ను బయటపెట్టని పోలీసులు

నార్పల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కృష్ణకిషోర్, శిరీష దంపతుల ఆత్మహత్యపై భిన్న కథనాలు వినపడుతున్నాయి. కృష్ణకిషోర్ కుటుంబం ఆత్మహత్య చేసుకునే ముందు అప్పుల గురించి సూసైడ్ నోట్ రాసినట్లు సమాచారం. ఆ నోట్‌ను పోలీసులు తీసుకుని, బయటికి విడుదల చేయలేదు. అయితే ఆ సూసైడ్ నోట్‌లో కృష్ణకిషర్ అప్పుల మొత్తం ఎంత ఉంది? అప్పులు చెల్లించాలని ఎవరూ వేధిస్తున్నారు? తన బంధువులు కుటుంబికుల మధ్య ఉన్న విభేదాలు తదితర వాటిపై అందులో ఏమైనా రాశాడా? అన్న విషయాలు చర్చనీయాంశంగా మారాయి. సూసైడ్ నోట్ గురించి నార్పల ఎస్‌ఐ సాగర్‌ను అడగగా నోట్ రాసింది నిజమేనని, అందులో ఏమి లేదని తెలిపారు.

ముగ్గురి మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి

కృష్ణకిషోర్, శిరీష, వారి బాబుకు అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతపురంలోనే అంత్యక్రియలను పూర్తి చేశారు. ఈ అంత్యక్రియలకు కృష్ణకిషోర్ అన్న రమేష్, మృతురాలి అక్కతో పాటు మరో పది మంది బంధువులు మాత్రమే హాజరుకావడం గమనార్హం. అయితే 20ఏళ్ల నుంచి తన తమ్ముడు కృష్ణకిషోర్‌తో ఆస్తి విషయంలో మాటలు లేవని పోలీసుల ఎదుట మృతుడి అన్న రమేష్ తెలిపాడు. దాదాపు రూ. 50లక్షలు వరకు అప్పులు ఇచ్చిన వారు ఎవరూ కూడా ఎవరూ అటువైపు కన్నెత్తి చూడలేదు.

పాప కాదు.. బాబు

కృష్ణకిషోర్, శిరీష దంపతులు ఆత్మహత్య చేసుకోవడంతో ఊయలలో చనిపోయిన బిడ్డ పాపేనని తొలుత అందరూ భావించారు. బంధువులు కూడా పాపా, లేక బాబా అనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. మృతి చెంది దాదాపు నాలుగు రోజులు కావడంతో మృతదేహాలు గుర్తించలేని స్థితిలో ఉండటంతో చనిపోయింది పాపే అని అందరూ అనుకున్నారు. పోలీసులు అలాగే భావించి వివరాలు వెల్లడించారు. అయితే మృతదేహాలను ఆస్పత్రికి తరలించిన తర్వాత అసలు విషయం తెలిసింది. చనిపోయింది పాప కాదు బాబు అని వెల్లడైంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సత్యసాయిబాబా (జయంతి)



ప్రముఖ ఆధ్యాత్మిక గురువు సత్యసాయిబాబా 1926 నవంబరు 23న అనంతపురం జిల్లా పుట్టపర్తిలో జన్మించారు. అసలు పేరు సత్యనారాయణ రాజు. వేదాంతిగా, గురువుగా, భగవంతుడి అవతారంగా భక్తులు విశ్వసిస్తారు. ఆయన మహిమల పట్ల చాలామందికి అపారమైన విశ్వాసం ఉంది. ప్రశాంతి నిలయంలోని విద్యాసంస్థ దేశవ్యాప్తంగా న్యాక్ నుంచి 'ఏ++' గుర్తింపు పొందిన ఏకైక సంస్థ కావడం గమనార్హం. పుట్టపర్తిలో సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్‌లో 200 పడకలతో ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 166 దేశాలలో సుమారు 10వేల సత్యసాయి సేవా సంస్థలు విద్య, వైద్య, సామాజిక సేవలు అందిస్తున్నాయి. 2011 ఏప్రిల్ 23న నిర్యాణం చెందారు.

గీతాదత్ (జయంతి)




గీతాదత్ (గీతా ఘోష్ రాయ్ చౌదరి) 1930 నవంబరు 23న ఫరీద్‌పూర్ జిల్లా ఇదిల్‌పూర్ గ్రామం (ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంది)లో జమీందారీ కుటుంబంలో జన్మించారు. నేపథ్య గాయని. హిందీ, బెంగాలీ క్లాజికల్ ఆర్టిస్ట్‌గా రాణించారు. 1200 హిందీ పాటలకుపైగా ఆలపించారు. మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, మైథిలి, భోజ్‌పురి, పంజాబీ భాషలలోనూ పాటలు పాడారు. ప్రముఖ నటుడు, దర్శకుడు గురుదత్‌ను వివాహం చేసుకున్నారు. ఆమె ఆలపించిన ఎవర్‌గ్రీన్ సాంగ్స్ నేటికీ ఆదరణ పొందుతున్నాయి. 1972 జూలై 20న కన్నుమూశారు. 2016లో ఆమె స్మారకార్థం ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

సర్ జగదీశ్ చంద్రబోస్ (వర్ధంతి)



'ఫాదర్ ఆఫ్ బెంగాలీ సైన్స్ ఫిక్షన్'గా పేరొందిన 'సర్' జగదీశ్ చంద్రబోస్ 1858 నవంబరు 30న అప్పటి బెంగాల్ ప్రావిన్స్‌లోని మైమెన్‌సింగ్ ప్రాంతంలో (ప్రస్తుతం బంగ్లాదేశ్) జన్మించారు. బయోలజిస్ట్, ఫిజిస్ట్, బొటానిస్ట్‌గా రాణించారు. సైన్స్ ఫిక్షన్‌పై ఎన్నో వ్యాసాలు రాశారు. రేడియో, మైక్రోవేవ్ ఆప్టిక్స్‌పై పరిశోధనలు చేశారు. వృక్ష భౌతిక శాస్త్రంలో కొన్ని అద్భుతమైన ఆవిష్కరణలు చేశారు. మొక్కల ఎదుగుదలకు సంబంధించి 'క్రెస్కోగ్రాఫ్' అనే పరికరాన్ని ఆవిష్కరించారు. 1904లో అమెరికా దేశపు పేటెంట్ హక్కులు పొందిన తొలి భారతీయుడు కావడం విశేషం. 1937 నవంబరు 23న కన్నుమూశారు.

రోల్డ్ డాహ్ల్ (వర్ధంతి)



బ్రిటీష్ నవలా రచయిత రోల్డ్ డాహ్ల్ 1916 సెప్టెంబరు 13న జన్మించారు. కవిగా, చిన్నకథల రచయితగా, స్క్రీన్ రైటర్‌గా రాణించారు. 20వ శతాబ్దంలో గ్రేటెస్ట్ స్టోరీ టెల్లర్స్ ఫర్ చిల్డ్రన్‌లో ఒకరిగా నిలిచారు. ఆయన రాసిన కథలు ప్రపంచవ్యాప్తంగా 250 మిలియన్ కాపీలకుపైగా అమ్ముడయ్యాయి. రాయల్ ఎయిర్‌ఫోర్స్ అండ్ రోజ్ టు ది ర్యాంక్ ఆఫ్ యాక్టింగ్ వింగ్ కమాండర్‌గా వ్యవహరించారు. 1990 నవంబరు 23న ఆయన కన్నుమూశారు.

కన్నడ రథానికి ఘన స్వాగతం

బంగారపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండ్యలో జరిగే 87వ అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కన్నడ రథయాత్ర సాగుతోంది. తాలూకా సరిహద్దులోని హంచాళకు చేరుకోగా ఫీల్డ్‌మార్షల్ కరియప్ప స్కూల్ విద్యార్థులు, ఎమ్మెల్యే నారాయణస్వామి ఘన స్వాగతం పలికారు. కన్నడ మాత భువనేశ్వరిదేవికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకోగా పురసభ, తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో రథానికి స్వాగతం పలికారు. ఊరేగింపులో వీరగాసె కళాబృందాల నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణస్వామి మాట్లాడుతూ నెలక్రితం ప్రారంభమై కన్నడ మాత భువనేశ్వరి దేవి రథయాత్ర ప్రస్తుతం బంగారపేటకు విచ్చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నో ఏళ్ల అనంతరం నవంబరులో కన్నడ రథయాత వచ్చిందన్నారు. ఇప్పటికే కన్నడ భవనాన్ని పట్టణంలో నిర్మించాలని భావించామన్నారు. నిర్మాణమయ్యాక నిత్యం భువనేశ్వరిదేవిని ఆరాధించాలన్నారు. రథయాత్ర సాయంత్రం వరకు పట్టణం, తాలూకా పంచాయతీ పరిధిలో ఊరేగిన అనంతరం కెజీఎఫ్ తాలూకా వెళ్తుందన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, ఉపాధ్యక్షురాలు చంద్రవేణి మంజునాథ్, పురసభ సభ్యుడు ఎస్ వెంకటేశ్, తహసీల్దార్ వెంకటేశ్, ఈఓ రవికుమార్, పురసభ ముఖ్య అధికారి సత్యనారాయణ, బీఈఓ గురుమూర్తి, సీడీపీఓ మునిరాజు, వ్యవసాయశాఖ ప్రతిభా, ఫీల్డ్ మార్షల్ కరియప్ప పాఠశాల అధ్యక్షుడు చంద్రశేఖర్, కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోపాల గౌడ, తాలూకా అధ్యక్షుడు సంజీవప్ప, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవి, ఇన్‌స్పెక్టర్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



కన్నడ రథం స్వాగతంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

వృత్తితోపాటు సమాజసేవ ప్రశంసనీయం



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

చింతామణి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వృత్తితోపాటు సమాజసేవ చేయడం ప్రశంసనీయమని కొర్లపర్తి గ్రామపంచాయతీ అధ్యక్షుడు కేవీ రాజేశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కదిరేనహళ్ళి ప్రభుత్వ ఉన్నతీకరించిన ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మూడల గొల్లహళ్ళి కే నరసింహప్ప సొంత ఖర్చుతో పాఠశాల విద్యార్థులందరికీ తట్ట, గ్లాసులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో రాజేశ్ మాట్లాడుతూ అనేకమంది ఉపాధ్యాయులు వృత్తికి పరిమితం అవుతారని, అయితే కొంతమంది మాత్రమే తమ సమాజసేవలతో పేరొందుతుంటా రన్నారు. టీచర్ నరసింహప్ప తమ పాఠశాల విద్యార్థులకు అవసరమైన వస్తువులు సమకూర్చడం అభినందనీయమన్నారు. గ్రామ పంచాయతీ సభ్యుడు జనార్ధన్ మాట్లాడుతూ ఇటీవలి విద్యావిధానం కేవలం అంకెలకే పరిమితం అవుతుండడంతో సమాజ అభివృద్ధికి ఆటంకం కలుగుతోందన్నారు. విద్యార్థులు చేసే తప్పులను అపరాధంగా భావించక వారిలో మార్పు తెచ్చేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. విద్యార్థులలో ఉత్తమ విలువలను నేర్పించాలన్నారు. తద్వారా చక్కటి పౌరులతో సమాజం సాధ్యమన్నారు. కార్యక్రమానికి ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు వెంకటేశ్ అధ్యక్షత వహించగా కొర్లపర్తి ప్రభుత్వ హైస్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు టివి రాజణ్ణ, సీఆర్‌పీ అల్తాఫ్ హుసేన్, కొర్లపర్తి గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు సుమ రమేశ్, గ్రామపంచాయతీ సభ్యురాలు శారద, భాగ్యమ్మ సుధాకరరెడ్డి, ఎస్‌డీఎంసీ మాజీ అధ్యక్షుడు చౌడరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

శిడ్లఘట్ట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సమాజంలో చోటు చేసుకుంటున్న ఘటనలను ఎదుర్కోవాలంటే చట్టాలపై అవగాహన పెరగాలని న్యాయాధికారి మొహ్మద్ రోషన్‌షా అభిప్రాయపడ్డారు. తాలూకాలోని వరదనాయకనహళ్ళి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ పాఠశాల, ఇల్లు లేదా ఇతర ప్రాంతాలలో బాలికలపై దౌర్జన్యాలు చోటు చేసుకుంటున్నాయని ధైర్యంగా ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అనుకోని పరిస్థితులను నిభాయించడానికి మానసికంగా సన్నద్ధంగా ఉండాలన్నారు. స్నేహితులు, అన్నదమ్ములు, ఉపాధ్యాలు, ఎవరైనా సరే బాలికలపట్ల అనుచితంగా ప్రవర్తించరాదన్నారు. అలాంటి పరిస్థితి వస్తే ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఒకవేళ దాడులు, దౌర్జన్యాలకు గురైనవారు తాలూకా న్యాయసేవాల సమితి నుంచి సలహాలు పొందవచ్చునన్నారు. 18ఏళ్లలోపు బాలికల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని అవగాహన పొందాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామల అధ్యక్షత వహించారు. ప్రధాన సివిల్ న్యాయాధికారి జె పూజా, బీఈఓ నరేంద్రకుమార్, సీడీపీఓ విద్యా ఏ వస్త్రద్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి, కార్యదర్శి భాస్కర్, ఎస్‌డీఎంసి అధ్యక్షుడు గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.



చట్టంపై అవగాహనా శిబిరంలో న్యాయాధికారి మొహ్మద్ రోషన్ షా తదితరులు

ఫిర్యాదు నమోదులో జాప్యంపై నిరసన



పోలీస్‌స్టేషన్‌లో బాధితుల నిరసన

విజయపుర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దాడికి సంబంధించి ఫిర్యాదు చేయగా గంటల తరబడి పోలీసులు స్పందించకపోవడంతో స్టేషన్‌లోనే బాధితులు నిరసన చేశారు. వివరాలిలా. దేవనహళ్ళి తాలూకా విజయపుర హోబళి గుడువనహళ్ళి సమీపంలోని భూమికి వెళ్లాక గుడువనహళ్ళి గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు తిలక్, ఆయన భార్య ప్రస్తుత గ్రామపంచాయతీ సభ్యురాలు, ఇంకా చంద్రశేఖర్‌లు దాడి చేశారని ఫిర్యాదుకు వస్తే పోలీసులు స్పందించడం లేదని దొడ్డతత్తమంగలకు చెందిన లక్ష్మమ్మ కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లోనే గురువారం రాత్రి నిరసన తెలిపారు. దొడ్డతత్తమంగల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ మాట్లాడుతూ గుడువనహళ్ళి గ్రామ సర్వే 36 పాత నెంబరు 13లో 2 ఎకరాలు 22 1/2 కుంటల భూమి తన తండ్రి చిక్కన్యానప్ప వేలంలో కొనుగోలు చేశారని ఇందుకు సంబంధించి పత్రాలు ఉన్నాయన్నారు. అయితే ఆయన పేరు పహణిలో నమోదు కాలేదన్నారు. పహణిలో ఖరాబు భూమిగా ఉందన్నారు. 1952 నుంచి సదరు భూమి తమ తండ్రి స్వాధీన అనుభవంలో ఉండగా రాగి, జొన్న అనప తదితర పంటలు పండించేవారన్నారు. పహణిలో ఖరాబుగా ఉండడంతో కొంతమంది తమకు మంజూరు చేయాలని కోర్టును ఆశ్రయించారన్నారు. తాము వాస్తవాలను కోర్టుకు వివరించగా తీర్పు తమకు అనుకూలంగా ఉంచిందన్నారు. కోర్టు తీర్పుతో నవంబరు 5న తన పేరిట మ్యుటేషన్, పహణిలో నమోదైందన్నారు.

కాగా తమ భూమి ఖరాబుగా నమోదు కావడాన్ని తెలుసుకున్న కొందరు తాత్కాలిక గుడిసెలు వేసుకున్నారన్నారు. వారిని ఖాళీ చేయించి సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని పోలీసులకు విన్నవించామన్నారు. ఈనెల 21న గుడిసెలు తొలగిస్తుండగా తిలక్, ఆయన భార్య, చంద్రశేఖర్‌లు దాడి చేసి ప్రాణాలు తీస్తామని బెదరించారన్నారు. ఘటనపై గురువారం మధ్యాహ్నం 3గంటలకు ఫిర్యాదు చేశామని, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరామన్నారు. రాత్రి గడిచినా స్పందన లేకపోవడంతో స్టేషన్‌లోనే నిరసన తెలిపామన్నారు. అయితే రాత్రి 11 గంటల తర్వాత ఎఫ్‌ఐఆర్ నమోదు చేశాక నిరసన వీడామన్నారు. కాగా ఫిర్యాదు నమోదుకు గంటల తరబడి వేచియుండేలా ఇబ్బంది కలిగించారని ఆక్రోశం వ్యక్తం చేశారు.

ఒక్కలిగ సంఘంలో విభేదాలు సరికాదు

- కేంద్రమంత్రి కుమారస్వామి

బెంగళూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమాజశ్రేయస్సు కోసం ఉదారమైన ఆలోచనలతో ఆవిర్భావమైన ఒక్కలిగ సంఘంలో గ్రూపు విబేధాలు తారస్థాయికి చేరుతున్నాయని ఇది సమంజసం కాదని కేంద్రమంత్రి కుమారస్వామి విచారం వ్యక్తం చేశారు. కెంపేగౌడ మెడికల్ కళాశాలకు కేంద్ర మెడికల్ కౌన్సిల్ ద్వారా 100 ఎంబీబీఎస్, 68 పీజీ సీట్లు అదనంగా మంజూరు చేయించినందుకు ప్రత్యేకంగా శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ ఒక్కలిగ సంఘంలో విబేధాలు ఎంతవరకు అభివృద్ధికి సహకారమవుతాయని ప్రశ్నించారు. మూడు నెలలకోసారి, ఆరు నెలలకోసారి పదాధికారుల మార్పు విబేధాలకు ఆజ్యం పోసినట్టు అవుతుందన్నారు. మన సమాజానికి చెందిన ఎంతో మంది కష్టపడి సంఘం ఏర్పాటు చేశారని, వాటిని సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో స్ఫటికపురి పీఠాధిపతి నంజావధూత మహాస్వామిజీ, ఆదిచుంచనగిరి విజయనగరశాఖ మఠాధిపతి సౌమ్యనాథస్వామిజీ, ప్రతిపక్షనేత అశోక్, ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు సీఎన్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కుమారస్వామికి ఒక్కలిగసంఘం సన్మానం

తాగని పాలకు బిల్లులు

- బిల్లును పీడీ కార్యాలయానికి పంపిన సీడీపీఓ

హిందూపురం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు పాలు సరఫరా చేయకుండానే బిల్లులు చేసుకొని కాంట్రాక్టర్లు, ట్రాన్స్‌పోర్టర్‌లు జేబులు నింపుకుంటున్నారు. గత మూడు నెలలుగా అంగన్‌వాడీ సెంటర్లకు పాలలో కోత విధించినప్పటికీ సెప్టెంబరు నెలకు సంబంధించి పాల బిల్లును పాస్ చేసినట్లు తెలుస్తోంది. ప్రతి సెంటర్‌కు ఒక బాక్సు ప్రకారం అంటే 10 లీటర్ల పాలు మూడు నెలల నుంచి కోత విధించి ఇస్తున్నారు. అయినప్పటికీ పూర్తి స్థాయిలో పాలు అందించామని కాంట్రాక్టర్లు, ట్రాన్స్‌పోర్టర్‌లు బిల్లు చేసుకున్నారు. ఇండెంట్ ప్రకారం కాకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారం పాల సరఫరా చేస్తున్నాడు. ఈ విషయమై సెంటర్ల కార్యకర్తలు సంబంధిత సూపర్‌వైజర్లకు తెలియజేశారు. సూపర్‌వైజర్లు సీడీపీఓకు సమాచారం అందించారు. అయిప్పటికి సీడీపీఓ పెడచెవిన పెట్టి బిల్లులు పూర్తి స్థాయిలో మంజూరయ్యేలా పీడి కార్యాలయానికి నివేదికలు పంపించారు. కింది స్థాయి అధికారులు పంపిన నివేదికల ప్రకారం పీడి కార్యాలయం బిల్లును ఓకే చేశారు. తెలిసి తెలిసి సీడీపీఓ ఎలా బిల్లును ఆమోదించారని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది బహిరంగంగా మాట్లాడుకోవడం విశేషం.

అందించని పాలకు బిల్లులు పెట్టడంతో లక్షలాది రూపాయలు కాంట్రాక్టరు, ట్రాన్స్‌పోర్టర్ జేబులోకి వెళ్లాయని తెలుస్తోంది. ప్రజాధనం ఇలా వ్యర్థం అయిన విషయంపై ఆంధ్రజ్యోతిలో 'పాల రాక్షసులు' అనే శీర్షికతో కథనం కూడా వెలువడింది. ఈ విషయంపై శనివారం ఇన్‌చార్జి పీడీ వరలక్ష్మీ హిందూపురం కేంద్రంలో అంగన్‌వాడీ సెంటర్లను విజిట్ చేసి విచారణ చేపట్టనున్నారు. అయితే సూపర్‌వైజర్లు, సీడీపీఓలకు తెలిపిన తరువాతే తాము పాలల్లో కోత విధించామని కాంట్రాక్టరు, ట్రాన్స్‌పోర్టర్ చెప్పడం కొసమెరుపు. అంటే ఇందులో వారి వాటా కూడా ఉందని చెప్పకనే చెబుతున్నారు. సూపర్‌వైజర్లు, సీడీపీఓ వాటాల్లో తేడా రావడంతోనే ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకొని ఇంటి గుట్టు బయట పెట్టారని కార్యకర్తలు నవ్వుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పాల కోతపై విచారణ పారదర్శకంగా జరిగేనా అని అంగన్‌వాడీ సిబ్బంది చర్చించుకుంటున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మడకశిరటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని వడుసులమ్మ, గంగాభవాని, కొల్లాపురమ్మ, కన్యకాపరమేశ్వరీ ఆలయాలతో పాటు మారుతీనగర్‌లో వెలిసిన అభయ ఆంజనేయస్వామి ఆలయం, మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివార్లకు ఆకుపూజ అలంకరణ, విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు, కన్నుల పండువగా నిర్వహించారు.

హలో.. హలో.. నో రెస్పాన్స్!

- విద్యుత్ కోతలతో పనిచేయని సెల్‌ఫోన్ నెట్‌వర్క్
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

మడకశిర రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమర్రి పంచాయితీ కేంద్రంలో ఉన్న మొబైల్ ఫోన్లు హలో! హలో! అని మాట్లాడుతుండాగానే మూగబోతున్నాయి. విద్యుత్ కోత కారణంగా సెల్ టవర్స్ పనిచేయకపోవడమే ఈ సమస్యకు కారణమని తెలుస్తోంది. తరచూ సెల్ సిగ్నల్స్ అందకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో బిఎస్ఎన్ఎల్ కనెక్షన్లు అధికంగా ఉన్నాయి. పంచాయితీ కేంద్రంలో స్టేట్‌బ్యాంక్, తపాల కార్యాలయం, గ్రామ సచివాలయం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలన్నీ బిఎస్ఎన్ఎల్ నెట్ వర్కుతోనే పనిచేస్తున్నాయి. తరచూ విద్యుత్ కోతతో సెల్‌ఫోన్ నెట్‌వర్కు పనిచేయడంలేదు. దీంతో కార్యాలయాలలో పనులు స్తంభించిపోతున్నాయి. అంతేకాకుండా ఎక్కువగా గ్రామీణ ప్రజలకు సెల్ కనెక్షన్‌లు ఉన్నాయి. తరచు విద్యుత్ కోత విషయాన్ని విద్యుత్ ఏఈ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించలేదని గ్రామస్థులు వాపోతున్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తగుచర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలి

అగళి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బ్యాంక్ అకౌంట్ ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలని ఎంపీడీఓ యాదవేంద్ర తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పతకాలు అందాలంటే ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలన్నారు. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ లింకును బ్యాంక్‌తో పాటు పోస్ట్‌ఆఫీస్ సచివాలయ సిబ్బంది దగ్గర వెళ్లి తప్పకుండా బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలన్నారు. ఈ లింక్ చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు డబ్బులు పడతాయన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం

- మాజీ సీఎస్ రత్నప్రభ



కార్యక్రమంలో పాల్గొన్న రత్నప్రభ తదితరులు

బెంగళూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఇ ద్వారా పరిశ్రమల ఏర్పాటు చేసే మహిళలకు సంపూర్ణ సహకారం అందిస్తామని మాజీ చీఫ్ సెక్రటరీ, మహిళా పారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షురాలు రత్నప్రభ అభిప్రాయపడ్డారు. ఎంఎస్‌ఎంఇలకు ఆర్థిక చేయూతనిచ్చే టైడ్ 1 ఇన్ ఇండియా, మహిళా పారిశ్రామిక వేత్తల సంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రత్నప్రభ మాట్లాడారు. రానున్న పదేళ్లలో దేశంలో కోట్లాదిమందికి ఉద్యోగాలు సాధ్యమన్నారు. టైడ్1 ఇండియా, మహిళా పారిశ్రామికవేత్తల సమాఖ్య ఒప్పందం చేసుకున్నాయన్నారు. సమాజంలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే తమ ఆశయమన్నారు. టైడ్ ఇండియా డిప్యూటీ కంట్రీ మేనేజర్ కుమారశేఖర్ మాట్లాడుతూ మహిళా పారిశ్రామిక వేత్తలతో ఒప్పందం ద్వారా రానున్న రోజుల్లో మరింతమందికి సహకారం కానుందన్నారు.

గొరు చన్నబసప్పకు సన్మానం

బెంగళూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షుడిగా ఎంపికైన గొరు చన్నబసప్పను సాహితీవేత్తలు సత్కరించారు. బెంగళూరు నగర జిల్లా కసాప అధ్యక్షుడు ప్రకాశ్‌మూర్తితోపాటు పదాధికారులు డాక్టర్ హం గు రాజేశ్, నాగరాజ్ స్వామి, మాగడి రాజేశ్, విజయలక్ష్మి, సత్యమూర్తి, రేణుకా హెగ్డే తదితరులు ఉన్నారు. కాగా మండ్యలో జరిగే సాహిత్య సమ్మేళనం వేదిక ఏర్పాటుకు మంత్రి చలువరాయస్వామి శుక్రవారం భూమిపూజ చేశారు.



చన్నబసప్పకు సన్మానంలో పలువురు సాహితీ అభిమానులు

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శిడ్లఘట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలోని సాదలిలో 66/11 కేవి సబ్‌స్టేషన్‌లో త్రైమాసిక నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈనెల 24 ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5వరకు పనులు కొనసాగనున్న తరుణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బెస్కాం అధికారులు తెలిపారు. సాదలి హోబళిలోని సాదలి, నల్లప్పనహళ్ళి, మిట్టేమరి, ఎస్ దేవగానహళ్లి చుట్టుపక్కల ప్రాంతాలలో విద్యుత్ కోత ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

న్యాయవాదుల నిరసన



నిరసనలో న్యాయవాదులు

బాగేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హోసూరు కోర్టు ఆవరణలో ఒక న్యాయవాదిపై దాడి జరగడాన్ని ఖండిస్తూ బాగేపల్లి జేఎంఎఫ్‌సిలో శుక్రవారం కోర్టు కలాపాలను న్యాయవాదులు బహిష్కరించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏ నంజుండప్ప మాట్లాడుతూ న్యాయవాదిపై చాకుతో దాడి చేయగా పరిస్థితి విషమంగా ఉందన్నారు. కోర్టు ఆవరణలోనే చోటు చేసుకున్న ఘటన అందరినీ కలచివేసిందన్నారు. న్యాయవాదులకు రక్షణ లేకుంటే ఎలాగని ప్రశ్నించారు. దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు. నిరసనలో న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు రామాంజి, కార్య దర్శి ప్రసన్న, సీనియర్ న్యాయవాదులు సుధాకర్, ఫయాజ్‌బాషా, ముస్తాక్ అహ్మద్, కరుణాసాగర్ రెడ్డి, నరసింహరెడ్డి, నరేంద్ర పాల్గొన్నారు.

మార్పు రాకుంటే పెను ప్రమాదమే..

బెంగళూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణంలో మార్పు రాకుంటే పెను ప్రమాదమని ప్రకృతికోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎల్ అండ్ డబ్ల్యు సంస్థ వైస్‌ప్రెసిడెంట్ రితూభాటి అభిప్రాయపడ్డారు. బెంగళూరులో సంస్థ ఉద్యోగులతో కలసి ఎమంత్ ఆఫ్ గివింగ్ పేరిట నగర శివారు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఉద్యోగులు వాడే టీ షర్టులను సంచులుగా మార్చి పంపిణీ చేశారు. అందరూ ప్రకృతిని కాపాడుకోవాలన్నారు.




తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.08	1,601.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,269	1,829
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,007	8,450
నీటి నిల్వ (టీఎంసీలు)	98.18	24.06

సండూరు సామ్రాజ్యంలో విజయం ఎవరిదో..?



అన్నపూర్ణ



బంగారు హనుమంత

● నేడు ఉప ఎన్నిక ఫలితాలు ● బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ

బళ్లారి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల ఫలితాలకు అంతా సిద్ధమయ్యింది. శనివారం ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలనుంది. నవంబరు 13న జరిగిన సండూరు 16వ శాసనసభ ఎన్నికల్లో మొత్తం ఆరుమంది అభ్యర్థులు పోటీలో ఉండగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఈ. తుకారాం భార్య ఈ. అన్నపూర్ణ, బీజేపీ నుంచి బంగారు హనుమంతు బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. నియోజక వర్గంలో మొత్తం 2,36,402 మంది ఓటర్లుండగా వీరిలో 1.17.936 మంది పురుషులు, 1.18.438 మంది మహిళలు ఉన్నారు. ఇతరులు 28 మంది ఉన్నారు. వీరిలో 90,922 మంది పురుషులు, 89,252 మంది మహిళలు, ఇతరులు 12 మంది మొత్తం 1,80.189 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సగటున 76. 24 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఈవీఎంలు బళ్లారి పాలిటెక్నికల్ కళాశాలలో భద్రపరిచారు. ఫలితాల పై కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలోనూ ఉత్కంఠ నెలకొంది. రెండు పార్టీలూ గెలుపును ప్రతిష్టాత్మకంగా భావించాయి. రాష్ట్ర అధికార పార్టీ కాంగ్రెస్, కేంద్ర అధికార పార్టీ బీజేపీ రెండూ గెలుపు కోసం పోరాడాయి. ఎన్నికల ప్రచారంలో మాటల యుద్ధం జోరుగా సాగింది. మరి కొన్ని గంటల్లో నేతల భవితవ్యం తేలనుంది.



ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి: ఏసీ

బళ్లారి సిటీ, నవంబరు22(ఆంధ్రజ్యోతి): సండూరు అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్కింపు చేపట్టనున్నారు. శుక్రవారం లెక్కింపు కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కమిషనర్ రాజేశ్ పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. కేంద్రంలో 253 ఓటింగ్ మిషన్లు, 13పోస్టల్ ఓట్ల లెక్కింపు, ఈటీపీబీఎస్-4 ఓట్ల లెక్కింపు చేపడ్తామన్నారు. ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు 15 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు ఒక ఎన్యుమరేషన్ సూపర్‌వైజర్, ఒక ఎన్యుమరేషన్ అసిస్టెంట్, ఒక అబ్జర్వర్‌ను నియమించినట్లు తెలిపారు. 19మంది ఎన్యుమరేషన్ సూపర్‌వైజర్లు, 21మంది ఎన్యూమరేషన్ అసిస్టెంట్లు , 20మంది ఎన్యూమరేషన్ సబ్ అబ్జర్వర్లను నియమించారు. ఓట్ల లెక్కింపు అధికారులు, సహాయకులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని తెలిపారు. సండూరు నియోజకవర్గంలో మొత్తం 253 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మొత్తం 19 రౌండ్లలో లెక్కింపు జరగనుంది. కౌంటింగ్ కేంద్రానికి 100మీటర్ల లోపు వాహనాలపై ఆంక్షలు విధించారు. జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలపై నిషేధం విధించినట్లు తెలిపారు. సీఆర్‌పీఎస్, సీఏఎస్ఎఫ్, కేఎస్ఆర్‌పీ, సివిల్ పోలీసుల భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఘనంగా మహాగణపతి ఆలయ వార్షికోత్సవం

బళ్లారి సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీరనగౌడ కాలనీ, గణేశ్ వీధిలో పంచముఖ మహాగణపతి తొమ్మిదో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. రుద్రాభిషేకం కార్యక్రమానికి గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి కుటుంబ సభ్యులతో సహా హాజరై పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కర్ణాటక హిస్టరీ అకాడమీ జిల్లా అధ్యక్షుడు టీహెచ్.ఎం.బసవరాజ్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. విజయ్ నరసింహ, వీరనగౌడ, చంద్రశేఖర్, మరిస్వామి, శివలింగప్ప, శ్రీధర గడ్డ కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగులను క్రీడల్లో ప్రోత్సహించాలి



క్రీడాకారులతో ఏడీసీ మహ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, నవంబరు22(ఆంధ్రజ్యోతి): సాధారణ క్రీడాకారుల తరహాలోనే దివ్యాంగులను కూడా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని ఏడీసీ మహమ్మద్ జుబేర్ సూచించారు. జిల్లాపరిపాలన, జిల్లాపంచాయతీ, మహిళాశిశు అభివృద్ధి శాఖ, దివ్యాంగుల సాధికారత క్రీడలశాఖ, స్వచ్ఛంద సేవా సంస్థలు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విమ్స్ స్టేడియంలో జరిగిన క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె అధ్యక్షత వహించి మాట్లాడారు. దివ్యాంగ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సాహం అందించాలన్నారు. పోటీల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కుష్టువ్యాధి అధికారి డా.వీరేంద్రకుమార్, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, జిల్లావికలాంగుల సంక్షేమాధికారి గోవిందప్ప, విద్యాసంస్థ నిర్వాహకులు, ఇదేసందర్భంలో క్రీడాపోటీల్లో పాల్గొన్న ప్రత్యేక చైతన్యవంతులందరికీ క్యాప్, టీషర్ట్‌లను పంపిణీ చేశారు. క్రికెట్, షాట్‌పుట్, రన్నింగ్‌రేస్, బైక్‌రేస్, జావిలిన్ త్రో, మ్యూజికల్ చైర్, పెయింటింగ్ కార్యక్రమాల్లో దివ్యాంగులు పాల్గొన్నారు.

ఏడుపడగల నాగప్పకు ప్రత్యేక పూజలు

కంప్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకుని బుక్కసాగర గ్రామం కొండల్లో వెలసిన ఏడుపడగల నాగప్పకు శుక్రవారం కార్తీక దీపోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమంలో విజయనగర జిల్లా అధికారులు ఎంఎస్ దివాకర్ కుటుంబ సభ్యులతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం జ్యోతిని వెలిగిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎంతో మహిమ గల స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హొస్పేట, గంగావతి, కంప్లి, చుట్టుపక్కల పట్టణాలు, గ్రామాలు నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు. దేవదాయశాఖ అధికారి హనుమంతు, ప్రశాంత్, నాగప్ప పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న జిల్లాధికారి ఎంఎస్ దివాకర్

నూతన గేట్లు ఏర్పాటు చేయాలని వినతి

కంప్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి నూతన గేట్లు ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. తుంగభద్ర రైతు సంఘం నాయకులు పురుషోత్తమగౌడ, కర్నూలు జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి తుంగభద్ర జలాశయం నూతన అధ్యక్షుడు ఎస్ఎస్ పాండే, కర్ణాటక ప్రభుత్వ జలసంపన్మూల కార్యదర్శి క్రిష్ణమూర్తికి వైకుంఠం అతిథిగృహంలో మనవి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పురుషోత్తమ గౌడ, రామిరెడ్డిలు మాట్లాడుతూ కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణలకు జీవనది అయిన తుంగభద్ర జలాలను కాపాడుకోవాలన్నారు. జలాశయం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు గేట్లు మార్చలేదు. వెంటనే శాస్త్రవేత్తలతో గేట్లను పరిశీలించి 33 నూతన గేట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందేనని, మున్ముందు అలా కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారితోపాటు ఎస్ఈ నీలకంఠారెడ్డి, వీరణ్ణగౌడ, లింగా రెడ్డి తదితరులు వున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

రైతు ప్రయోజనాలే లక్ష్యం కావాలి

● విద్యార్థులు వ్యవసాయ పరిశోధనలపై దృష్టి పెట్టాలి ● కేకేఆర్‌డీబీ కార్యదర్శి సుందరేశ్ బాబు

రాయచూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో విద్యార్థులు సాగించే పరిశోధనలు రైతు ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగాలని కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి కార్యదర్శి సుందరేశ్ బాబు సూచించారు. రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం 16వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుందరేశ్ బాబు, రాష్ట్రంలో అనేక వ్యవసాయ విశ్వ విద్యాలయాలు ఉన్నా రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం సాధిస్తున్న విజయాలు అద్భుతమన్నారు. ఇక్కడే నేలలు, వాతావరణ అనుకూలతలు విభిన్నమైన పంట ఉత్పత్తులు తదితర అంశాలన్ని వ్యవసాయ విశ్వ విద్యాలయానికి ఊతంగా నిలిచాయన్నారు. అదే సమయంలో ధారవాడ విశ్వవిద్యాలయం నుంచి వేర్పడి రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయంగా కొత్తగా ఆవిర్భవించిన అనంతరం ఇక్కడి రైతులకు అనేక ప్రయోజనాలు లభించాయన్నారు. కాగా రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పరిశోధనలు సాగించే విద్యార్థులు రైతులకు అన్ని విధాల అనుకూలంగా ఉండే రీతిలో తమ పరిశోధనను సాగించడంతో పాటు ఉన్నత విద్యావంతులుగా తాము ఎదిగేందుకు తగిన కృషి చేయాలన్నారు. తద్వార జీవితంలో సుస్థిర స్థానాలను దక్కించుకోవాలని ఆకాంక్షించారు.



ప్రసంగిస్తున్న సుందరేశ్ బాబు



నామినేషన్ వేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగ సంఘం ఎన్నికకు నామినేషన్లు

బళ్లారి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలకు శుక్రవారం బళ్లారిలోని ఉద్యోగుల భవనంలో నామినేషన్ల పర్వం మొదలయ్యింది. ఉద్యోగ సంఘం ఎన్నికలకు కే. అంజినప్ప ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. 2024 నుంచి 2029 ఏట వరకూ కొనసాగే కారికారి సమితి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ ఎన్నికల అదికారి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిద శాఖల ఉద్యోగులు 441 మంది సభ్యులు ఉన్నారు. వీరు ఆయా ప్రభుత్వ శాఖల్లో వారి స్థాయి కమిటీని ఎన్నుకున్నారు.. అయితే ప్రస్తుతం జిల్లా స్థాయి కారికార సమితి ఎన్నిలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో కారికారి మెంబర్లుగా ఎన్నికయిన వారు రాష్ట్ర స్థాయిలో జరిగే అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో ఓటు వేసేందుకు లేదా వీరు కూడా పోటీలో నిలిచేందుకు వీలు ఉంటుంది. పలు శాఖల అధికారులు నామినేషన్ వేశారు.

క్విజ్ పోటీలు ఎంతో ఉపయోగకరం



బహుమతులు అందజేస్తున్న టీచర్స్ ఫోరం అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆలోచనాశక్తి, మేధోశక్తి, జ్ఞాపక శక్తి, ఊహాశక్తి పెంచేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లాధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన సోషల్ క్విజ్‌లో ఆయన పాల్గొని విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలతో పిల్లల్లో చదివే అలవాటు పెరుగుతుందని, వార్తాపత్రికలు , లైబ్రరీ పుస్తకాలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. చిన్నారులు దివ్య, సుమ, సునీల్‌కుమార్, రంజిత్‌కుమార్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దిల్షాద్ బేగం, చన్నమ్మ, చ వైశాలి, శశమ్మ, రామాంజనేయులు, విజయముంద్రగి, సుమ, విద్యార్థి ప్రతినిధి అనూష తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న బీజీ సభ్యులు

సిరుగుప్ప, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో ఉత్తమ భవిష్యత్తు విద్యతోనే సాధ్యమని బీజీ సంస్థ అధ్యక్షుడు దొడ్డ ఉలిగప్ప తెలిపారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో 6వ వార్డు సిరుగుప్ప పాఠశాలలో విద్యార్థులకు బీజీ సంస్థ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు దొడ్డ ఉలిగప్ప మాట్లాడుతూ నేటి రోజుల్లో అన్ని రంగాలలో ముందుకు దూసుకెళ్లాలంటే విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. పుస్తకాలు, వార్తాపత్రికలు చదివి విద్యార్థులు జ్ఞానం పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా నగరసభ కౌన్సిలర్ నటరాజ, ముఖ్య ఉపాధ్యాయురాలు పర్వీన్ దొడ్డగట్టి, ఉపాధ్యాయులు బసమ్మ, తస్లీమా, సమాజ సేవకుడు యల్లప్ప, పాత విద్యార్థులు షేక్షావలీ, నాగేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కూలడం ఖాయం

బళ్లారి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శీతాకాల సమావేశాల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయమని, సీఎం సిద్దరామయ్యకు ఉద్వాసన తప్పదని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం గంగావతిలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ పార్టీలో సీఎం కావాలనుకునేవాళ్లు ఎక్కువ మంది ఉన్నారన్నారు. వాళ్లే సిద్దరామయ్యను దించేస్తారన్నారు. సండూరు ఉప ఎన్నికల్లో రూ. కోట్లు ఖర్చుచేశారని ఆరోపించారు. సీఎం హోదాలో ఆయన సండూరులోనే మకాం వేశారని, దీనిని బట్టి ఆయనలో ఎంత భయం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. బెళగావి సమావేశాలు ముగిసేవరకైనా సిద్దూ సీఎంగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు.

మహిళపై దూసుకెళ్లిన ట్రాక్టర్.. పరిస్థితి విషమం

రాయచూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) ద్విచక్ర వాహనం పై వస్తున్న మహిళను వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఒకటి ఢీకొట్టి మహిళ పై నుంచి వెళ్లడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. శుక్రవారం తన కూతురును పాఠశాలకు వదిలి ప్రమిళ అనే మహిళ తిరిగి వస్తుండగా బోళమానదొడ్డి రోడ్డులో రాయచూరువైపు వస్తున్న ట్రాక్టర్ ఒకటి ఆమెను ఢీకొట్టింది. మహిళ ప్రమాదం జరిగిన సమయంలో కిందపడడంతో ఆమె పైనుంచి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను రిమ్స్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలి

●పాలక మండలి ఉపాధ్యక్షుడు రవీంద్ర జల్దార్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవీంద్ర జల్దార్

రాయచూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కళా పోటీల్లో ప్రతిభను చాటి జిల్లాకు చెందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పేరు ప్రఖ్యాతులు సాధించాలని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పాలక మండలి ఉపాధ్యక్షుడు రవీంద్ర జల్దార్ సూచించారు. నగరంలో పండిత్ సిద్ధరామ్ జంబలదిన్ని రంగమందిరంలో శుక్రవారం నిర్వహించిన పీయూ కళాశాల సాంస్కృతిక కళా పోటీల్లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకు పేరనికగా గన్న రాయచూరు జిల్లా నుంచి విద్యార్థులు మరింత ప్రతిభను చూపాల్సి ఉందన్నారు. అదే సమయంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఇదే రోజు స్థానిక బాలుర పీయూ కళాశాల వద్ద ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడిను రవీంద్ర జల్దార్, విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు క్రీడలు, సాంస్కృతిక కళా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం వల్ల బహుముఖ ప్రజ్ఞావంతులుగా నిలవాలని ఉద్బోధించారు.

సత్యసాయి జయంతికి పటిష్ట బందోబస్తు

పుట్టపర్తిరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వీ రత్న తెలిపారు. శుక్రవారం ఆమె పోలీస్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ఉత్సవాలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో పాటు పలువురు ప్రముఖులు, భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నారన్నారు. దీంతో బందోబస్తు నిమిత్తం ఆరుగురు డీఎస్పీలు, 23 మంది సీఐలు, 48 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌ఏఎస్ఐలు, 171 మంది పోలీసు కానిస్టేబుల్స్ 300 మంది, మహిళా కానిస్టేబుల్స్ 26 మంది, హోంగార్డ్సు 170 మంది, నాలుగు స్పెషల్ పార్టీ బృందాలను నియమించినట్లు చెప్పారు.

హోసూరు జోన్



ప్రసంగిస్తున్న కలెక్టర్ సరయు

హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వండి: కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాల సమీపంలోని దుకాణాలలో డ్రగ్స్‌కు సంబంధించిన వస్తువుల విక్రయిస్తున్నారనే సమాచారం గుర్తిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, స్కూల్ ఎడ్యుకేషన్ స్టూడెంట్ హెల్ప్ లైన్ 14417, యాంటి డ్రగ్ హెల్ప్ లైన్ 10581 వంటి టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సరయు సూచించారు. జిల్లా ప్రిన్సిపల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మునిరాజ్, జిల్లా విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కృష్ణగిరి జిల్లాలో తమిళం, ఆంగ్లం, గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్ర, జీవశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, అకౌంటెన్సీ, వాణిజ్యం, ఆర్థికశాస్త్రం, చరిత్ర ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తక్కువ శాతం ఉతీర్ణత సాధించిన 200 మంది ఉపాధ్యాయులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. 12వ తరగతి త్రైమాసిక పరీక్షలలో కృష్ణగిరి జిల్లాలో గత 5 ఏళ్లలో ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే తమిళం, గణితం, అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులలో కొంత వెనుకబడి ఉన్నట్టు గుర్తించారు. ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా పాఠాల వారీగా కారణాలను వివరించారు. సక్రమంగా బడికిరాని విద్యార్థులు, చదువుపై ఆసక్తి లేని వారికి మొదటి నుంచి సరైన మార్గదర్శకాలు ఇవ్వాలని, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి సబ్జెక్టులను టీఎల్ఎం(విషయ సంబంధిత ఉపకరణాలు)ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. విద్యార్థులను ప్రేరేపించడానికి దోహదపడేలా స్లో లెర్నర్‌లకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులల్లో అదనపు శ్రద్ధ చూపాలని, వారి పురోగతిని తదుపరి సమీక్ష సమావేశంలో నివేదించాలని కలెక్టర్ సూచించారు. వచ్చే సెమిస్టర్‌లలో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థులందరూ మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా ప్రోత్సహించాలన్నారు. పాఠశాల విద్యార్థుల మధ్య ప్రతిరోజూ భక్తి సమావేశంలో డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పాఠశాలల్లో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి పాఠశాలల్లో ప్రతిజ్ఞ, ర్యాలీ, చిత్రలేఖన, వ్యాసరచన, క్విజ్, ప్రసంగ పోటీ తదితర కార్యక్రమాలను మాదకద్రవ్యాల వ్యతిరేక వేదికల ద్వారా క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాదుల అసోసియేషన్ సభ్యులు

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

హోసూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): హోసూరు కోర్టు ఆవరణలో ఒక న్యాయవాది దాడిని ఖండిస్తూ తమిళనాడు పుదుచ్చేరి న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన సాగింది. సమాజ అభ్యున్నతికి పాటుపడే ఉపాధ్యాయులు, వైద్యులు, న్యాయవాదులపై దాడులు సాగితే మనుగడ ఎలాగని పలువురు ప్రశ్నించారు. పలు చోట్ల కోర్టు కార్యకలాపాలను బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. శుక్రవారం హోసూరులో తమిళనాడు, పుదుచ్చేరి బార్ అసోసియేషన ఫెడరేషన్ ఆధ్వర్యంల్లో నిరసన ప్రదర్శన జరిగింది. కోర్టు ఆవరణ గేటు ఎదుట ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మారప్పన్ నేతృత్వంలో ప్రత్యేక సమావేశం జరిగింది. హోసూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందకుమార్ సహ రాష్ట్ర జిల్లా నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో పెద్దసంఖ్యల్లో న్యాయవాదులు పాల్గొన్నారు. న్యాయవాదులకు కూడా రక్షణ కల్పించే చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు మారప్పన్ మీడియాతో మాట్లాడుతూ ఇటీవల తమిళనాడు వ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. హోసూరుల్లో దాడికి గురై ప్రాణాపాయ స్థితిల్లో చికిత్స పొందుతున్న న్యాయవాదికి తగిన భరోసా కల్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. న్యాయవాదుల భద్రతకు భరోసా కల్పించేలా తమిళనాడు శాసనసభ సమావేశాల్లో ఒక చట్టాన్ని ఆమోదించాలని ముఖ్యమంత్రిని కోరనున్నట్టు తెలిపారు. వ్యక్తిగత ద్వేషంతో లాయర్లపై దాడులు జరిగితే వివక్ష చూపడం, పట్టించుకోకపోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. దీనిపై నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

హోసూరు(కృష్ణగిరి) నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు కృష్ణగిరి కలెక్టర్ సరయు తెలిపారు. కృష్ణగిరి జిల్లా కలెక్టరేట్‌లో రైతు ఫిర్యాదుల పరిష్కార సమావేశం శుక్రవారం జరిగింది. జిల్లా రెవిన్యూ అధికారి సాదనకురళ్‌తో పాటు, జిల్లా అటవీ అధికారి కార్తికేయని, జాయింట్ డైరెక్టర్ పచ్చయప్పన్, జాయింట్ డైరెక్టర్ రాజమోహన్, సహకార సంఘాల జాయింట్ రిజిస్ట్రార్ నటరాజన్ శాఖాధికారులు వ్యవసాయాధికారులు పాల్గొన్నారు. రైతు సంఘాల సభ్యులు పాల్గొని తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తేగా సానుకూలంగా స్పందించారు.

రైతులకు అవగాహన శిబిరం

హోసూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతాల రైతుల కోసం 'ఆత్మ' పథకం క్రింద సూడుగొండపల్లి గ్రామ వ్యవసాయ అభివృద్ధి కమిటీ ట్రైనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు భువనేశ్వరీ అధ్యక్షత వహించారు. అలాగే రబీ సీజన్‌లో ఉలవలు, రాగి ఇతర పంటల సాగులో సాంకేతికత గురించి అవగాహన కల్పించారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధి పథకం, ముఖ్యమంత్రి భూసార పరిరక్షణ పథకం వంటి ముఖ్యమైన పథకాల ప్రయోజనాలు, సబ్సిడీ వివరాలు, సీడ్ ఫారం ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అదియమాన్ అగ్రికల్చర్ కళాశాల రీసెర్చ్ స్టేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏళుమలై మాట్లాడుతూ పంటల్లో తెగులు నియంత్రణ, ఇతర వైరస్‌ల నివారణకు సాంకేతిక పద్ధతులు, సోలార్ ల్యాంప్ ట్రాప్ వాడకం, ఉపయోగించే పద్ధతులు, ప్రయోజనాలను వివరించారు. ఉప వ్యవసాయ అధికారి మురుగేశన్ మాట్లాడుతూ జీవ ఎరువులు, సూడోమోనాస్, సూక్ష్మపోషక ఎరువుల ప్రాముఖ్యత, ప్రయోజనాలను వ్యవసాయ రంగంల్లో అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలను వివరించారు. సహాయ వ్యవసాయ అధికారి, నల్లూరు గోవిందస్వామి ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత ప్రయోజనాలు వర్మి కంపోస్టింగ్ పద్ధతుల గురించి, పంటల బీమా పథకం ప్రయోజనాల గురించి వ్యవసాయ వ్యర్థాల కంపోస్టు తయారీ సాంకేతిక పద్ధతుల గురించి వ్యవసాయ దారులకు వివరించారు. ఆత్మ రీజినల్ టెక్నికల్ మేనేజర్ సుగుణ రైతులకు చెత్త కుళ్లిపోవడం వల్ల ఉత్పత్తి ప్రయోజనాలు, ఆత్మ పథకం యొక్క అప్లికేషన్లు, ప్రదర్శనలు, టిల్లర్ యొక్క ప్రాముఖ్యత ఉపయోగించే పద్ధతుల గురించి రైతులకు ప్రదర్శన ఇచ్చారు. శిక్షణకు సంబంధించిన ఏర్పాట్లను అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ షణ్ముగం పర్యవేక్షించారు.



ఆత్మ పథకం శిబిరంలో పాల్గొన్న రైతులు